సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 2 । డిసెంబర్ । 2023



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అవరణలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి బొచ్చ నాగేంద్ర గుప్తా, పుష్పావతి దంపతులు(పెనుగొండ మండలం) శుక్రవారం రూ 1,01,116 విరాళం అందజేశారు.



ప్రతిభకు ప్రోత్సాహం

ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఉపకార వేతనాలు అందిస్తోంది.

8లో

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి శుక్రవారం డెల్టా కాలువలకు 3,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,300,మధ్య డెల్టాకు 600,పశ్చిమ డెల్టాకు 2,000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

క్రీడాకారులకు ఆడుదాం... ఆంధ్రతో ప్రోత్సాహం



తానేటి వనిత, హోమ్ మంత్రి

కొవ్వూరు: క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఆడుదాం ఆంధ్ర ఉపకరిస్తుందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మంత్రి కొవ్వూరులో విలేకర్లతో మాట్లాడారు. ఈ పోటీలకు గతనెల 27 నుంచి క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ,క్రీడలపై ఆసక్తి ఉండి పదిహేనేళ్లు నిండిన యువతీ, యువకులు పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈనెల 15 నుంచి సచివాలయం,మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు ఫిబవరి 3వ తేదీ వరకు జరుగుతాయన్నారు. కబడ్డీ,ఖోఖో,బ్యాండ్మింటన్, క్రికెట్,వాలీబాల్ వంటి అంశాలతో నిర్వహిస్తారన్నారు. ఆడుదాం ఆంధ్ర వెబ్‌సైట్‌లో గానీ, సచివాలయాల్లోగానీ, 1902 కాల్‌సెంటర్‌కి ఫోన్ చేసి క్రీడాకారులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం వేదికగా క్రీడాకారులు ప్రతిభను కనబరిచి నియోజకవర్గానికి పేరు తీసుకువస్తారని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఉత్సాహం ఉన్న యువత పోటీలను సద్వినియోగ పరుచుకోవాలన్నారు. వివరాలను గ్రామ,వార్డు సచివాలయాల్లో సంప్రదించాలని మంత్రి సూచించారు.

నేడు, రేపు ఓటు నమోదు శిబిరాలు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో శని, ఆదివారాల్లో ఓటు నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. ముసాయిదా జాబితా, ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, పెండింగ్‌లో ఉన్న రాజకీయ పార్టీల ఫిర్యాదులు తదితర అంశాలపై శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి కలెక్టర్లతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,569 పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ బీఎల్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తారన్నారు. 2023 ఓటరు ముసాయిదా జాబితాను ఆయా బీఎల్‌వోల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. సంబంధిత పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్న ఓటర్లు ఆ జాబితాలో తమ ఓటును సరిచూసుకోవాలన్నారు. జిల్లాలో 47 వేలకు పైబడి యువ ఓటర్లు ఉన్నారని, ఇప్పటి వరకూ 19 వేల మందిని నమోదు చేశామన్నారు. కొత్తగా ఓటు నమోదు, మార్పులు చేర్పులకు సంబంధించి 74 వేల ఎపిక్ కార్డుల ముద్రణ జరగాల్సి ఉందన్నారు.

ప్రమాణ స్వీకారం



రాష్ట్ర అధ్యక్షుడు శేషు తదితరులతో ముద్దాల అను

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా ముద్దాల తిరుపతిరావు (అను) శుక్రవారం తాడేపల్లిలోని రాష్ట్ర కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, ఎండీ ఎస్.కృష్ణమూర్తి తదితరులు ముద్దాల అనుతో ప్రమాణ స్వీకారం చేయించి రిజిస్టర్‌లో మొదటి సంతకం చేయించారు. ఈ సందర్భంగా అను మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు. పేదకాపు విద్యార్థుల సంక్షేమానికి సీఎం జగన్ మార్గదర్శకత్వంలో పనిచేస్తానన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి జిల్లాలో ఈనెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ప్రత్తిపాడు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీపడ్డదగిన క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించనున్నామన్నారు.

తక్షణమే స్పందన

- సత్ఫలితాలిస్తున్న 'జగనన్నకు చెబుదాం'
- సమస్య చెప్పిన వెంటనే స్పందిస్తున్న పోలీసు యంత్రాంగం
- సివిల్, క్రిమినల్, మహిళలపై వేధింపుల కేసులపై చర్యలు
- నిర్భయంగా వచ్చి సమస్యలు చెబుతున్న ప్రజలు



'జగనన్నకు చెబుదాం'లో ఫిర్యాదు దారుల నుంచి సమస్య వింటున్న ఎస్పీ జగదీష్



సాక్షి, రాజమహేంద్రవరం: ప్రజా విజ్ఞప్తులకు తక్షణ పరిష్కారం చూపేందుకు, వారి బాధలు తొలగించి బాసటగా నిలిచేందుకు ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' పేరుతో అర్జీల స్వీకరణకు నాంది పలికింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి సోమవారం బృహత్తర ప్రక్రియ సాగుతోంది. జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఫిర్యాదుల స్వీకరణ సత్ఫలితాలనిస్తోంది. సాధారణంగా పోలీసులతో సమస్యలు చెప్పాలంటే గతంలో ఓకింత భయాందోళన చెందేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులకు ప్రభుత్వం దూరం చేసింది. స్నేహపూర్వక వాతావరణంలో సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించడంతో ఎంతో మంది బాధితులకు స్వాంతన కలిగిస్తోంది. తూర్పుగోదావరి ప్రత్యేక జిల్లాగా ఏర్పడిన తర్వాత ఎస్పీ కార్యాలయానికి నేరుగా వచ్చి ఎస్పీకే తమ సమస్యలు చెప్పుకుంటున్నారు. పోలీసు యంత్రాంగం సైతం తక్షణం స్పందిస్తుండటంతో సమస్యలు వేగవంతంగా పరిష్కారమవుతున్నాయి.

అక్కడికక్కడే పరిష్కారం

జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నేరుగా జిల్లా ఎస్పీ పి.జగదీష్, అడిషనల్ ఎస్పీ రజనీ, అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖర్ పాల్గొంటున్నారు. ప్రతి వారం 30 నుంచి 35 వరకు అర్జీలు స్వీకరిస్తున్నారు. ఇలా ఈ ఏడాది 5వ నెల నుంచి ఇప్పటి వరకు వివిధ సమస్యలపై మొత్తంగా 1,336 వినతులు తీసుకున్నారు. అందులో 53 శాతం సమస్యలను పోలీసులు పరిష్కరించారు. మిగిలిన వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు అర్జీ రూపంలో ఇచ్చే ప్రతి సమస్యనూ నేరుగా జిల్లా స్థాయి అధికారులే వింటున్నారు. కొన్నింటికి అప్పటికప్పుడే పరిష్కారం చూపుతున్నారు. మరికొన్నింటికి కౌన్సెలింగ్ ద్వారా పరిష్కారం చూపుతున్నారు. అయితే ఆర్థిక, సైబర్ నేరాలపై మాత్రం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి చర్యలు చేపడుతున్నారు.

ఏ నేరమైనా..

ఎలాంటి నేరాలైనా వెంటనే స్పందిస్తున్నారు. సైబర్ నేరాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఉద్యోగాల పేరుతో మోసం, లైంగిక వేధింపులు, కుటుంబ తగాదాలు, సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు, అమ్మాయిలతో అసభ్యంగా ప్రవర్తించడం.. ఇలా సివిల్ పరిధిలోలేని ప్రతి సమస్యకూ పోలీసులు పరిష్కారం చూపుతున్నారు. బాధితుల సమస్య తెలుసుకోవడంతో పాటు వారు ఎవరిపై ఫిర్యాదు చేస్తున్నారో వారిని పిలిపించి వాస్తవాలు తెలుసుకుంటున్నారు. బాధితుల వైపు న్యాయం ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. అందువల్లే బాధితులు నిర్భయంగా వచ్చి తమ సమస్య చెప్పుకుంటున్నారు. ముఖ్యంగా అమ్మాయిలు కూడా ఎలాంటి సంకోచం లేకుండా తమ ఇబ్బందులను వివరిస్తూ స్వాంతన పొందుతున్నారు.

ఈ ఏడాది మే నుంచి అందిన ఫిర్యాదులు

ఫిర్యాదు ఏంటి	అర్జీలు
భూ తగాదాలు	567
మహిళలపై వేధింపుల కేసులు	231
న్యూసెన్స్	152
శారీరక సంబంధమైన నేరాలు	131
ఆస్తి తగాదాలు	120
మిస్సింగులు	54
పరిపాలన సంబంధం	39
ప్రమాదాలు	22
తప్పుడు ఫిర్యాదులు	20

కొన్ని వినతులను పరిశీలిస్తే..

- సీతానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో బొబ్బిల్లంక గ్రామానికి చెందిన వ్యక్తి తన గోడును వెల్లబోసుకున్నాడు. తల్లిదండ్రులన్న జాలి కూడా లేకుండా తనను, తన భార్యను కుమారుడు ఇంటి నుంచి గెంటేశాడని ఆవేదన చెందారు. అంతటితో ఆగకుండా బెదిరించి చిత్రహింసలకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందిన ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్‌కు కేసును రెఫర్ చేసి పరిష్కరించాలని ఆదేశించారు.
- రంగంపేట పోలీస్ స్టేషన్ పరిధి కోటపాడు గ్రామనికి చెందిన మహిళ తన భర్త, అత్తమామలు శారీరకంగా, మానసికంగా హింసించి తనను ఇంటి నుంచి గెంటేయాలని చూస్తున్నారని ఆవేదన చెందింది. భర్త, అత్తమామలపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేసింది.
- రాజమహేంద్రవరం నగరంలోని జాంపేటకు చెందిన ఓ వ్యక్తి, తన ఏటీఎం కార్డు ద్వారా వేరే వ్యక్తి రూ.10 వేలు డ్రా చేసుకున్నాడని ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకుని తన డబ్బు తిరిగి ఇప్పించాలని పోలీసులను ఆశ్రయించాడు.
- గోకవరం పోలీస్ స్టేషన్, కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కుటుంబ సభ్యులు తనపై దౌర్జన్యం చేశారని, అంతటితో ఆగకుండా తీవ్రంగా కొట్టారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.
- బొమ్మూరుకు చెందిన ఓ మహిళ తన భర్త వేరే స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని వాపోయింది. ఆమె మోజులో పిల్లలను వదిలి వెళ్లిపోయాడని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్తపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. ఇలా ఏ సమస్య వచ్చినా ముందుగా పోలీసుల చెంతకే వస్తున్నారు.

నిర్భయంగా పోలీసులను ఆశ్రయించవచ్చు



ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించవచ్చు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఫిర్యాదు స్వీకరిస్తున్నాం. అర్జీలు తీసుకునే సమయంలో వారితో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తున్నాం. వారిని కూర్చోబెట్టి మరీ బాధలను తెలుసుకుంటున్నాం. సమస్యలు క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే వాటి పరిష్కారానికి మార్గం చూపుతున్నాం. చిన్నపాటి సమస్య అయితే సంబంధిత పోలీసు స్టేషన్‌కు రెఫర్ చేస్తున్నాం. పరిష్కారం అయిందా? లేదా? అని ఆరా తీస్తున్నాం. జిల్లాలో పోలీసు యంత్రాంగం సమర్థంగా పనిచేస్తోంది. ఎవరైనా తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల వద్ద చెప్పుకోవచ్చు.

– పి.జగదీష్, ఎస్పీ

హెచ్ఐవీ బాధితులపై ప్రేమానురాగాలు

- వ్యాధి నియంత్రణకు సమష్టి కృషి
- కలెక్టర్ మాధవీలత



చిన్నారులతో కలిసి అల్పాహారం తీసుకుంటున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్, కమిషనర్ దినేష్ కుమార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి, విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపకుండా, వారిని ప్రేమతో ఆదరించాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక కంబాల చెరువు పార్క్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ పి.జగదీష్, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి హాజరయ్యారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులు పూర్తిస్థాయి జీవితాన్ని కొనసాగించేలా వారికి అండగా ఉండాలన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు. ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ ఎయిడ్స్ బారిన పడిన పిల్లలపై విద్యాలయాలు, మరే ఇతర సంస్థలు వివక్ష చూపకూడదన్నారు. సమాజంలో వ్యాధి నియంత్రణకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ హెచ్ఐవీ బారిన పడిన వారికి మంచి వైద్యం, రక్షణను అందించాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజలందరూ కలిసికట్టుగా ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. అనంతరం పిల్లలతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర, డ్వామా పీడీ పి.జగదాంబ, మహిళా ప్రత్యేక జైల్ సూపరింటెండెంట్ సీహెచ్ వసంత కుమారి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నగర ప్రజలు, స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

8న ఎయిర్‌పోర్టు టెర్మినల్ భవనానికి శంకుస్థాపన

- పాల్గొననున్న సీఎం జగన్ , కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య
- విమానాశ్రయాన్ని పరిశీలించిన కలెక్టర్ మాధవీలత



మధురపూడి విమానాశ్రయంలో టెర్మినల్ భవనం పరిశీలనకొచ్చిన జిల్లా కలెక్టర్ మాధవీలతతో అధికారులు

మధురపూడి: మధురపూడిలోని రాజమహేంద్రవరం విమానాశ్రయం టెర్మినల్ భవనం విస్తరణ పనులకు ఈ నెల 8న శంకుస్థాపన జరగనుంది. కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత తెలిపారు. ప్రస్తుతం ఇక్కడి ఎయిర్‌పోర్టు వేదికగా 20 విమాన సర్వీసులు సేవలందిస్తున్నాయి. ఇవి హైదరాబాద్, చెన్నై, బెంగుళూరులకు రాక, పోకలు నిర్వహిస్తున్నాయి. ఈ విమానాశ్రయానికి 3,165 మీటర్లతో కూడిన రన్‌వే ఉంది. 11 పార్కింగ్ బేలు ఉన్నాయి. గంటకు 225 మంది ప్రయాణికులు వేచి ఉండే సామర్థ్యం గల టెర్మినల్ భవనం ఉంది. గంటకు 1,400 మంది ప్రయాణికులు వేచి ఉండటానికి అనువుగా ఉంటుంది. దీంతో వీఐపీ లాంజ్‌లు పెరగడంతో పాటు, కమర్షియల్ షాపులు ఏర్పాటుచేయడానికి అవకాశం ఉంటుంది. ఈ మేరకు శుక్రవారం ఎస్పీ జగదీష్, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్. జ్ఞానేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఎస్. తేజ్ భరత్, ఎయిర్‌పోర్టు ఇంజినీరు అధికారులతో కలిసి ముందస్తు ఏర్పాట్లు పరిశీలనలో భాగంగా కలెక్టర్ మాధవీలత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విమానాశ్రయానికి మహర్దశ రానున్నట్టు, దానిలో భాగంగానే టెర్మినల్ భవనం విస్తరణ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఆ మేరకు ఈ నెల 8 వతేదీన భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంటే తహసీల్దార్ పవన్‌కుమార్, ఎయిర్‌పోర్టు ఇంజినీరింగ్ అధకారులున్నారు.

జిల్లాలో 83.46 శాతం పింఛన్ల పంపిణీ



కోలమూరుకు చెందిన దేవుడమ్మకు రాజమహేంద్రవరం రాజున్యూరో హాస్పిటల్లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఖాదర్ బాబు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం జిల్లాలో శుక్రవారం వేకువ జాము నుంచే మొదలైంది. గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి సైతం అందించారు. రాత్రి ఎనిమిది గంటల సమయానికి జిల్లాలో 83.46 శాతం పంపిణీ పూర్తయ్యింది. 2,42,408 మంది లబ్ధిదారులకు రూ.66.90 కోట్లకు గాను 2,02,317 మందికి రూ.55.83 కోట్లు అందజేశారు. డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతిపథం ప్రాజెక్టు డైరెక్టర్ పి.వీణాదేవి పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ నెల 5వ తేదీ వరకూ పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు.

4న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈనెల 4న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ముత్తూట్ ఫైనాన్స్‌లో ఇంటర్న్‌షిప్, ప్రొబిషనరీ ఆఫీసర్స్, జియో ఫైబర్‌నెట్‌లో హెచ్‌ఎస్‌ఓ, సంతోషి మాత ప్యాకింగ్ కంపెనీలో ట్రైనీ ఆపరేటర్స్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ ప్రొడక్షన్, సియోన్ హెచ్. డబ్ల్యూ ఎ సుమిత్, డిక్సాన్ అండ్ ఇసుజు మోటర్స్ కంపెనీల్లో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారన్నారు. అదే విధంగా డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నా రు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటిఐ, డిప్లొ మో, డిగ్రీ, అండ్ బిటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 4వ తేదీ సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లు, జెరాక్సులతో హాజరుకావాలని పీడీ వివరించారు.

ఆటకు నేను సిద్ధం.. మరి మీరు..

- ఆడుదాం ఆంధ్రలో ఉత్సాహంగా పాల్గొనండి
- యువతకు ఎంపీ భరత్ రామ్ సూచన



ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: ఆటకు వస్తున్నా.. మరి మీరు కూడా సిద్ధమేనా అని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈనెల 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం..ఆంధ్రా' కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువత పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. యువతీ యువకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి, వారిలోని క్రీడా ప్రతిభను ప్రదర్శించాలన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. మనం ఎంత ఆరోగ్యంగా, బలంగా ఉంటామో మన జీవితం కూడా అంత ఆనందంగా ఉంటుందన్నారు. రాజమహేంద్రవరం అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్యులు, వైద్య విద్యార్థులు కూడా ఈ పోటీల్లో భాగస్వాములు కావాలన్నారు.

రేపట్నుంచి భారీ వర్ష సూచన

- అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఆదేశం
- కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

కంట్రోల్ రూం నంబర్లు

కలెక్టరేట్ : 8977935609
రాజమహేంద్రవరం ఆర్డీవో : 0883-2442344
కొవ్వూరు ఆర్డీవో : 08813231488

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. భారీ వర్షాలు పడతాయనే సూచనలు పురస్కరించుకుని ఖరీఫ్ సీజన్‌లో వరి పంట కోతలపై రైతులు వెంటనే స్పందించేలా చూడాలని కలెక్టర్ మాధవీలత అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల నేపథ్యంలో ఐఎండీ అంచనాల ప్రకారం ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం శనివారం నాటికి తీవ్రవాయుగుండంగా బలపడనుందని ఆమె శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. పశ్చిమ వాయువ్య దిశగా పయనిస్తూ ఆదివారం నాటికి నైరుతి బంగాళాఖాతంలో తుపానుగా మారుతుందన్నారు. ,సోమవారం మధ్యాహ్నానికి దక్షిణకోస్తా తీరాలకు చేరుకుంటుందన్నారు. మంగళవారం మధ్యాహ్నం నెల్లూరు-మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. దీని ప్రభావంతో ఆదివారం నుంచి మంగళవారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు, అలాగే మంగళవారం అక్కడక్కడ అతితీవ్ర భారీ వర్షాలు నమోదైయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఆదివారం నుంచి కోస్తా తీరం వెంబడి గంటకు 55 -75 కీమీ వేగంతో బలమైన గాలులు వీసే అవకాశం ఉందన్నారు.ఖరీఫ్ పంట కోతల సమయం దృష్ట్యా రైతులు వ్యవసాయపనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా, డివిజన్ , మండల స్థాయి యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. వారి వారి ప్రధాన కార్యాలయాలలో అందుబాటులో ఉండాలన్నారు. మండల పరిధిలోని తహశీల్దార్లు, ఎంపీడీఓలు, వ్యవసాయ అనుబంధ అధికారులు మండల ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉండాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్ళరాదన్నారు.

సత్యదేవుని దర్శించిన 25వేల మంది

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయాన్ని శుక్రవారం 25 వేల మంది భక్తులు దర్శించారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. సత్యదేవుని దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అర గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. అనంతరం రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. కాగా రత్నగిరి క్షేత్రపాలకుడు శ్రీరాముని జన్మనక్షత్రం పునర్వసు సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం సీతారాములకు పట్టాభిషేకం నిర్వహించారు.

విపత్కర పరిస్థితుల్లోనూ విధులకు సంసిద్ధం

- ఎస్పీ జగదీష్
- పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల మాక్ డ్రిల్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అనుకోని విపత్కర పరిస్థితుల్లో ఎలా స్పందించాలనే విషయంపై శుక్రవారం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మ్‌డ్, సివిల్, ట్రాఫిక్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ ప్రజల మాన, ప్రాణాల రక్షణే పోలీసుల ధ్యేయమని, దానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలని, ఎటువంటి పరిస్థితులు ఎదురైనా వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అత్యవసర సమయంలో, సంక్లిష్ట పరిస్థితులలో అసాంఘిక శక్తుల అల్లర్లను అరికట్టేందుకు, అతి తక్కువ సమయంలోనే పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఈ మాక్ డ్రిల్ నిర్వహించామన్నారు. సిబ్బంది ప్రతి శుక్రవారం పరేడ్ నిర్వహించి, అన్ని విభాగాల వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ఎల్.చెంచిరెడ్డి, ఆర్ఐలు యు.శ్రీనివాసరావు, సంజీవ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం



బాలిక మనశ్విని వైద్యానికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులను ఆదేశిస్తున్న జేసీ లావణ్య వేణి

అధికారులను ఆదేశించిన జేసీ లావణ్య వేణి

ద్వారకాతిరుమల: అర్జీదారులు సంతృప్తి చెందే రీతిలో స్పందన దరఖాస్తులను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి అన్నారు. ద్వారకాతిరుమలలోని శ్రీకృష్ణ దేవరాయ కాపు కల్యాణ మండపంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జేసీ లావణ్య వేణి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుల అధ్యక్షతన నిర్వహించారు. వారు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు, వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్పందన దరఖాస్తులు రీ ఓపెన్ కాకుండా పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జేసీ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్పందనలో వచ్చే విజ్ఞప్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కార విధానంపై ప్రజలు సంతృప్తి చెందని కారణంగా దరఖాస్తులు రీ ఓపెన్ అవుతున్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు ప్రజలు తెలిపిన సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, క్షేత్రస్థాయిలో విచారణ చేసి, దరఖాస్తులు ఎందుకు రీ ఓపెన్ అవుతున్నాయో కారణాలు తెలుసుకోవాలన్నారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం.. స్పందన కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై జిల్లా స్థాయిలో కూడా సమీక్షిస్తామన్నారు. స్పందన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 186 దరఖాస్తులు అందినట్టు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. వాటిని అర్హులైన పేదలకు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా, మండల స్థాయిలో స్పందన కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను పేద ప్రజలకు చేరేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12 వేల ఉపకార వేతనం
- ప్రవేశ పరీక్షకు సన్నద్ధమైన 10,233 మంది విద్యార్థులు
- రేపు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష



ప్రవేశ పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

రాయవరం: ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఉపకార వేతనాలు అందిస్తోంది. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పేరుతో ఏటా ప్రతిభ చూపిన విద్యార్థులకు నాలుగేళ్ల పాటు (తొమ్మిదవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తయ్యే వరకు) ఆర్థిక సాయం అందిస్తోంది. నెలకు రూ.1,000 వంతున ఏడాదికి రూ.12వేలు ఉపకార వేతనం ఇస్తోంది. ఇందుకు ఏటా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఆదివారం ఈ ప్రవేశ పరీక్షను నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ సమాయత్తమవుతోంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షను నిర్వహించనున్నారు.

సన్నద్ధమవుతున్న విద్యార్థులు

ఈ ఏడాది ఉమ్మడి జిల్లా పరిధిలో 10,233 మంది ప్రవేశ పరీక్షకు సన్నద్ధమవుతున్నారు. ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పరీక్షపై అవగాహన కల్పిస్తున్నారు. ఆయా పాఠ్యాంశాల్లో శిక్షణ ఇస్తూ పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

ప్రశ్నపత్రం ఇలా..

ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్ష 180 మార్కులకు ఉంటుంది. ఇందులో 90 మార్కులకు రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లిష్ ఉండగా, మరో 90 మార్కులకు ఏడు, ఎనిమిదవ తరగతి గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలపై ప్రశ్నలుంటాయి.

మొదటి పేపరులో..

మెంటల్ ఎబిలిటీ (వెర్బల్ నాన్ వెర్బల్) పేపరు 90 మార్కులకు ఉంటుంది. నంబర్ సిరీస్ 10, సింపుల్ అర్థమెటిక్ 10, మిస్సింగ్ క్యారెక్టర్స్ 10, వర్డ్ ఎనాలజీ 10, లెటర్ సిరీస్ 10 మార్కులు ఉంటాయి. నాన్ వెర్బల్ నుంచి 40 మార్కులకు ఉంటాయి.

రెండవ పేపరులో ఏడవ తరగతి కీలకం

రెండో పేపరు కూడా 90 మార్కులకు ఉంటుంది. ఇందులో గణితం 20 మార్కులు, సైన్స్‌లో పీఎస్‌కు 10, కెమిస్ట్రీ 10, బయాలజీ 10, సోషల్ సబ్జెక్టులో భూగోళం 10, చరిత్ర 10, పౌరశాస్త్రం 10, అర్థశాస్త్రం నుంచి 10 మార్కులుంటాయి. ఏడవ తరగతి పూర్తిగా, 8వ తరగతి నవంబరు సిలబస్ వరకు చదివి ఉండాలి. కొన్ని జనరలైజ్డ్ బిట్స్, సబ్జెక్టు మీద, అదనపు సమాచారం, కరెంట్ ఎఫైర్స్‌పై కూడా తగిన జ్ఞానం కలిగి ఉండాలి. 180 నిమిషాల్లో 180 బిట్స్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది. పేపర్–1లో సమయాన్ని సద్వినియోగం చేసుకుని వేగంగా సమాధానాలు రాసి, అక్కడ మిగిలిన సమయాన్ని పేపర్–2లో గణితానికి వినియోగించుకుంటే విజయం సాధించడం సులభమని నిపుణులు చెబుతున్నారు. ఒక ప్రశ్నకు ఒక నిమిషం సమయం మాత్రమే ఉంటుంది. ప్రశ్నపత్రంలో 60 మార్కులు సులభంగా, 60 మార్కులు మధ్యస్థంగా, 60 మార్కులు కఠినంగా ఇచ్చే అవకాశముంది. సులభమైన ప్రశ్నలతో పాటు, మధ్యస్థంగా ఉన్న ప్రశ్నలకు సమాధానాలు రాబడితే విజయం తథ్యమవుతుంది. కనీసం 130 మార్కులు దాటిన వారికి విజయావకాశాలు ఉంటాయి. ప్రశ్నకు ఇచ్చిన నాలుగు సమాధానాల్లో సరైన దానిని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే బబ్లింగ్ చేయాలి. ఏ ప్రశ్నకు ఆ ప్రశ్నకు సంబంధించిన సమాధానానికి నంబరు ఎదురుగా బబ్లింగ్ చేయాల్సి ఉంటుంది. ఓఎంఆర్ షీటు మీద అదనంగా ఏమీ రాయకూడదు.

ఇదీ లెక్క...

జిల్లా	పరీక్షా కేంద్రాలు	విద్యార్థులు
కోనసీమ	15	3,121
కాకినాడ	15	4,170
తూర్పుగోదావరి	13	2,942
మొత్తం	43	10,233

ఏర్పాట్లు పూర్తి

ప్రవేశ పరీక్షకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాల వారీగా నిర్దేశించిన పరీక్షా కేంద్రాల పరిధిలో పేపర్లను ఆయా పోలీస్ స్టేషన్లలో భద్రపరిచేందుకు ఏర్పాట్లు చేశారు. కోనసీమ జిల్లా పరిధిలో రామచంద్రపురం, కొత్తపేట డివిజన్ కేంద్రాల్లో నాలుగేసి, అమలాపురం డివిజన్‌లో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాకినాడ జిల్లాలో కాకినాడ డివిజన్ కేంద్రంలో ఎనిమిది, పెద్దాపురం డివిజన్ కేంద్రంలో ఏడు కేంద్రాలు ఏర్పాటు చేయగా తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కొవ్వూరు డివిజన్‌లో నాలుగు, రాజమహేంద్రవరం డివిజన్ కేంద్రంలో తొమ్మిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అదనపు తరగతులు



రోజూ పాఠశాలలో అదనపు తరగతిని నిర్వహించి ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఉపాధ్యాయులను సన్నద్ధం చేస్తున్నారు. నాలుగు నెలలుగా పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రిపేర్ అవుతున్నాం. కచ్చితంగా విజయం సాధిస్తాననే నమ్మకం ఉంది.

– బి.సంతోషిణి, 8వ తరగతి విద్యార్థిని, జెడ్పీహెచ్ఎస్, వెంటూరు, రాయవరం మండలం

ఏటా శిక్షణ



పదేళ్లుగా ఏటా విద్యార్థులను ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు సన్నద్ధం చేస్తున్నాం. గతేడాది మా పాఠశాలలో 10 మంది ఎంపికయ్యారు. ఈ ఏడాది కూడా రోజూ అదనపు తరగతులు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు శిక్షణనిచ్చాం.

– విత్తనాల సుబ్బారావు, మున్సిపల్ హైస్కూల్ రత్నంపేట, రామచంద్రపురం

సీఎస్, డీవోల నియామకం పూర్తి



ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు సీఎస్, డీవోల నియామకం పూర్తి చేశాం. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం.

– నక్కా సురేష్, అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల విభాగం, కోనసీమ జిల్లా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మృతుడు రాజేష్

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లికి చెందిన కెల్లా రాజేష్(26)మృతి చెంది ఉండటాన్ని నల్లజర్ల పోలీసులు కనుగొన్నారు. ఎస్ఐ నరసింహమూర్తి అందించిన వివరాల ప్రకారం అనంతపల్లికి చెందిన కెల్లా శ్రీనివాస్, పార్వతిల పెద్దకుమారుడు రాజేష్ పదిరోజులుగా కనపడటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటర్ వరకు చదువుకున్న రాజేష్ నిలకడ లేక దురలవాట్లకు బానిసయ్యాడని గ్రామస్తులు చెబుతున్నారు. పోలీసుల సూచనల మేరకు పలు ప్రాంతాలలో రాజేష్ ఆచూకీ కోసం గాలిస్తుండగా పోలవరం కుడికాలువలో అచ్చన్నపాలెం వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉంది. మృతదేహాన్ని చేపలు తినడంతో బాగాపాడై ఉంది. కుటుంబ సభ్యులు అతడు వేసుకున్న దుస్తుల ఆధారంగా గుర్తించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పిఠాపురంలో...

పిఠాపురం: పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్న ఒక వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం పోలీసులు కనుగొన్నారు. పోలీసుల కథనం ప్రకారం పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో సాయిబాబా గుడి సమీపంలో నివాసముంటున్న నల్లాడ లక్ష్మణరావు అలియాస్ రాంబాబు ఇంట్లో మృతి చెంది ఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి అశ్వనితో వివాహం కాగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యతో మనస్పర్థల కారణంగా ఐదేళ్ల క్రితమే విడాకులు తీసుకున్నారు. ఇద్దరు పిల్లలతో భార్య కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలోని పెడనలో ఉంటోంది. లక్ష్మణరావు ఒంటరిగా ఇక్కడ ఉంటూ పెట్రోల్ బంకులో పని చేస్తున్నాడు. అతను ఐదు రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సై మురళీమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు



నూతిలోకి దూకిన వెంకటలక్ష్మి

కొత్తపల్లి: భర్త తిట్టాడనే కోపంతో ఒక వివాహిత నూతిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కుతుకుడుమిల్లి పోస్టు ఆఫీసు ఎదురుగా అద్దెకు ఉంటున్న కాకాడ వెంకటలక్ష్మి భర్త దొరబాబు తిట్టాడనే కోపంతో శుక్రవారం మధ్యాహ్నం నూతిలోకి దూకింది. దీంతో స్థానికులు కొత్తపల్లి పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఎస్సై స్వామినాయుడు తన సిబ్బందితో చేరుకుని నూతిలోకి దూకిన ఆమెను స్థానికుల సహాయంతో రక్షించారు. అనంతరం వెంకటలక్ష్మి, దొరబాబుకు కౌన్సెలింగ్ ఇచ్చి, మందలించి విడిచిపెట్టారు.



వెంకటలక్ష్మిని రక్షిస్తున్న పోలీసులు, స్థానికులు



వెంకటలక్ష్మికి, దొరబాబుకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై స్వామినాయుడు

ర్యాంకింగ్ పెంపునకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య రామ్మోహనరావు

రాజానగరం: రాష్ట్రంలో విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని నాణ్యత హామీ విభాగం అకడమిక్ అధికారి జి. శ్రీరంగంమాధ్యూ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నాణ్యత హామీ విభాగం, ఏపీ ఉన్నత విద్యా మండలి సంయుక్త ఆధ్వర్యంలో 'నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ 2024' అనే అంశంపై బుధవారం వర్క్‌షాప్ జరిగింది. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలో ఉన్న కళాశాలల ఐక్యూఏసీ డైరెక్టర్లతో ఈ విధంగా వర్క్‌షాపులు నిర్వహిస్తూ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో అవగాహన కలిగిస్తున్నామన్నారు. ఇది భవిష్యత్తులో ప్రతి విద్యా సంస్థకు ముఖ్యమన్నారు. నాణ్యత హామీ విభాగం డైరెక్టర్ ఆచార్య కె.రామ్మోహనరావు మాట్లాడుతూ విద్యాసంస్థలు నాక్ గుర్తింపుతోపాటు ర్యాంకింగ్ పై కూడా దృష్టిని పెట్టాలన్నారు. దీనివలన విద్యా సంస్థల మధ్య పోటీ పెరుగుతుందని, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా విద్యాసంస్థలు తయారవుతాయన్నారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ యూనివర్సిటీలో ర్యాంకింగ్‌ని పెంచే విధంగా ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నామని వివరించారు. గ్లోబలైజేషన్‌కి అనుగుణంగా వివిధ కోర్సులను అమలు చేయడంతోపాటు వివిధ సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, రీసోర్స్‌పర్సన్ డాక్టర్ ఆర్. రవీంద్రన్ (చెన్నై), వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 163 మంది ఐక్యూఏసీ కోఆర్డినేటర్స్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ప్రో కబడ్డీ రిఫరీగా మురళీకుమార్

– నేటి నుంచి మ్యాచ్‌లు



సామర్లకోట: కబడ్డీ క్రీడాకారుడు, ఫిజికల్ డైరెక్టర్ బోగిళ్ల మురళీకుమార్ ప్రో కబడ్డీ పదో సీజన్‌కు రిఫరీగా ఎంపికయ్యారు. క్రికెట్ తర్వాత ఎక్కువ మంది ప్రో కబడ్డీని తిలకిస్తున్నారు. అహ్మదాబాద్, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, గ్రేటర్ నోయిడా (ఉత్తరప్రదేశ్), పంచకుల (ఛండీఘడ్), ఢిల్లీ, కోల్‌కతా, పాట్నా, జైపూర్, పుణేల్లో శనివారం నుంచి ప్రోకబడ్డీ లీగ్ మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. ఈ మ్యాచ్‌లకు మురళీకుమార్ రిఫరీగా వ్యవహరిస్తారు. శనివారం నుంచి ప్రోకబడ్డీ మ్యాచ్ గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ప్రారంభమవుతుందని మురళీకుమార్ స్థానిక విలేకర్లకు తెలిపారు. గతేడాది జాతీయ స్థాయి మహిళా కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌కు రిఫరీగా కూడా మురళీకుమార్ వ్యవహరించారు. రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక రిఫరీ ఈయన కావడం విశేషం. ప్రస్తుతం మురళీకుమార్ జగ్గంపేట జెడ్పీ హైస్కూల్‌లో పీడీగా పని చేస్తున్నారు. ఈయన ఇప్పటి వరకు ఏడు పర్యాయాలు ప్రోకబడ్డీ రిఫరీగా వ్యవహరించారు. ప్రోకబడ్డీ రిఫరీగా ఎంపికైన మురళీకుమార్‌ను ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసు, రాష్ట్ర కోచ్ పోతుల సాయిప్రసాద్ అభినందించారు.

సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు రేపు

తాళ్లరేవు: కాకినాడ జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నారు. డీఎస్ఏ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ టెన్నిస్ మైదానంలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్వీ సాయిబాబు, వి.అఖిల శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు ఈ నెల 9, 10 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో జరుగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్ షిప్, రాష్ట్ర జట్ల ఎంపికల్లో పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి వి.నీలిమకు రిపోర్ట్ చేయాలని కోరారు.

షూటింగ్ బాల్ బాలబాలికల జట్ల ఎంపిక రేపు

రావులపాలెం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్–19 జిల్లాస్థాయి షూటింగ్ బాల్ ఎంపికలు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తారని సెక్రటరీ బి.సతీష్‌బాబు శుక్రవారం తెలిపారు. 01-01-2005 తర్వాత జన్మించినవారు అర్హులని, ఎంపికకు వచ్చే క్రీడాకారులు వారి వెంట ఆధార్ కార్డు తీసుకు రావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8, 9, 10 తేదీలలో గుంటూరు జిల్లా మార్టూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 80081 51026, 93978 56767 ఈ నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు రాష్ట్ర టీ 20 క్రికెట్ జట్ల ఎంపిక

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం సిటీ): ఏపీ రాష్ట్ర టీ 20 క్రికెట్ జట్ల ఎంపిక ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు రాజమహేంద్రవరంలోని సెంచరియన్ క్రికెట్ ఆకాడమీలో నిర్వహిస్తున్నట్లు ట్వంటీ ట్వంటీ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కర్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికల్లో విజయం సాధించిన జట్టు గోవాలో జరిగే టీ 20 క్రికెట్ నేషనల్ క్యాష్ ప్రైజ్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటుందని చెప్పారు. ఎంపికలకు క్రీడాకారులు వైట్ అండ్ వైట్ డ్రెస్, షూస్, క్రికెట్ కిట్‌లతో రావాలన్నారు.